# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక

సంపుటి - 1 సంచిక - 341 మంగళవారం 21 జనవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




4

## దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త


దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103


## రాహుల్‌గాంధీకి ఊరట

### క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు




న్యూఢిల్లీజనవరి 20(జర్నలిస్ట్ వార్త): :కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. **మిగతాది 2లో...**

## దావోస్‌లో ఇద్దరు తెలుగు సీఎంల భేటీ

జనవరి 20(జర్నలిస్ట్ వార్త): స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు మంత్రులు హాజరయ్యారు. మంత్రులతో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో అరుదైన కలయిక జరిగింది. జ్యూరిచ్ చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం.. అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలుగు రాష్ట్రాల ఇద్దరు సీఎంలు, మంత్రులు ఒకే చోట కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చిత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, శ్రీధర్ బాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహననాయుడు ఉన్నారు.



## అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం

**ప్రమాణం చేయించిన సుప్రీం ప్రధాన న్యాయమూర్తి**

**తొలుత ప్రమాణం చేసిన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్**

**హాజరైన విదేశాంగ మంత్రి జైశంకర్...ముఖేశ్ అంబానీ**



వాషింగ్టన్‌జనవరి 20(జర్నలిస్ట్ వార్త): అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు హాజరయ్యారు.

## రాష్ట్రంలోని పది ప్రాజెక్టులకు సహకరించండి

**ఆర్థిక సహాయం, అనుమతులు ఇప్పించండి - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన డిప్యూటీ సిఎం భట్టి**

హైదరాబాద్:జనవరి 20(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం, అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కోరారు. ఒడిస్సా రాష్ట్రం కోణార్క్‌లో జరుగుతున్న మూడవ జాతీయ మైనింగ్ మంత్రుల సమావేశంలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల ఆర్థిక అంచనాలు, అనుమతులతో కూడిన లేఖను కిషన్ రెడ్డికి కోణార్క్ లో డిప్యూటీ సీఎం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులను మీ పరిశీలనకు, అవసరమైన చర్యలు తీసుకోవడానికి మీకు తెలియజేయాలని కోరుకుంటున్నానని ఆలేఖలో డిప్యూటీ సీఎం కోరారు. ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టు ను 2016లో కేంద్ర



రహదారుల మంత్రిత్వ శాఖ సూత్రప్రాయంగా ఆమోదించింది. 2022 జూలై 3న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయ సంకల్ప సభలో 350 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్ నిర్మాణాన్ని ప్రస్తావించార ని గుర్తు చేశారు**మిగతాది 2లో...**

## సాగునీటి కోసం రైతన్నలు రోడ్డెక్కడం కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనం: హరీష్ రావు



2లో.

## సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

**కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు**

**మూడుసార్లు జీతాలు పెంచిన దేవుడు కేసీఆర్**

**అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచాం : మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్,జనవరి 20(జర్నలిస్ట్ వార్త):ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

**మిగతా 2లో.**



## దావోస్ చేసుకున్న సిఎం రేవంత్ బృందం

### పెట్టుబడులు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం

హైదరాబాద్,జనవరి 20(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం దావోస్ చేసుకుంది. ఆయనవెంట ఐటిశృాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ ఇతర ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి దావోస్ పర్యటనకు బయలు దేరింది. **మిగతాది 2లో...**



## ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార కేసులో దోషి సంజయ్ రాయ్‌కి జీవితఖైదు

**తామంతా దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశామన్న సీఎం మమత**

**ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి బలవంతంగా సీబీఐకి బదిలీ చేశారని వ్యాఖ్య**

**ఒకవేళ పోలీసుల చేతుల్లోనే ఉంటే వారు దోషికి ఉరిశిక్ష పడేలా ప్రయత్నించే వారన్న సీఎం**

కోల్‌కతా:కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార కేసులో తాజాగా వెలువడిన తీర్పుపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. తామంతా దోషి సంజయ్ రాయ్ కి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశామని ఆమె పేర్కొన్నారు. కానీ, కోర్టు అతనికి జీవితఖైదు విధించిందని చెప్పారు. **మిగతాది 2లో...**



## మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



2లో.

# రాష్ట్రంలోని పది ప్రాజెక్టులకు సహకరించండి

(మొదటి పేజి తరువాయి)
ప్రాజెక్టు వ్యయం రూ.34,367.62 కోట్లు అవుతుందని అంచనా వేశారని తెలిపారు. ఉత్తర, దక్షిణ కారిడార్లకు కేంద్రం ఆర్థిక ఆ మోదం ఇప్పటికీ ఇవ్వలేదని, భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం ఖ ర్చును భరించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.మరో ప్రాజెక్టు రేడియల్ రోడ్ల అభివృద్ధి గురించి వివరిస్తూ హైదరాబాద్ మెట్రో కారిడార్లోని 10 కొత్త గ్రీన్ఫీల్ రేడియల్ రోడ్ల అభివృద్ధి ద్వారా నగర విస్తరణకు ప్రణాళిక రూపొందించినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.45,000 కోట్లుగా తెలిపారు. మూడవది మెట్రో రైల్ ఫేజ్- 2కి కేంద్రం సహకారం అందించాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు సంబంధించి మొత్తం 76.4 కి.మీ మేర కొత్త కారిడార్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని, దీని అంచనా వ్యయం రూ.24,269 కోట్లు అని స్పష్టం చేశారు. ఇక నాలుగో ప్రాజెక్టు మూసీ నది తీరాభివృద్ధి గురించి వివరిస్తూ మూసీ నదికి పునరుజ్జీవన ప్రాజెక్టు, బాపు ఘాట్ వద్ద గాంధీ సరోవర్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.14,100 కోట్లుగా తెలిపారు.ఐదవ అంశంగా గోదావరి –మూసీ నదుల అనుసంధానమని తెలిపారు. గోదావరి నుంచి 5 టీఎంసీ నీటిని మళ్లించి మూసీ నదిని శుద్ధి చేయడం కోసం చేపట్టే ఈ ప్రాజెక్టు వ్యయం రూ.7,440 కోట్లుగా భట్టి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ నగరానికి సీవరేజ్ మాస్టర్ ప్లాన్ కోసం హైదరాబాద్ నగరానికి 7,444 కి.మీ పొడవునా సీవరేజ్ మాస్టర్ ప్లాన్ రూపొందించబడిందని వెల్లడించారు. ఈప్రాజెక్టు వ్యయం రూ.17,212.69 కోట్లుగా తెలిపారు. వరంగల్ భూగర్భ డ్రైనేజీ ప్రణాళికలో భాగంగా రూ.4,170 కోట్లు వ్యయంతో చేపట్టే ప్రణాళిక అమలు కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బందర్ పోర్ట్ నుండి హైదరాబాదు డ్రై పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్నిరూ.17,000 కోట్లుతో చేపట్టే ప్రాజెక్టును అమలు చేయాలని కోరారు. సింగరేణి బొగ్గ బ్లాక్ కేటాయింపులో భాగంగా తెలంగాణలోని గోదావరి వ్యాలీ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించాల్సిందిగా అభ్యర్థించారు. ఇక చివరిగా సెమీకండక్టర్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మొత్తం వ్యయం రూ.1,63,559.31 కోట్లతో సెమీకండక్టర్ తయారీ కోసం హైదరాబాదు అనుకూలమైన కేంద్రంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ పది ప్రాజెక్టులపైనా కేంద్రమంత్రిగా, తెలంగాణ వాసిగా కేంద్రం నుంచి తగిన సహాయం, సహకారం అందించాలని భట్టి విక్రమార్క కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు.

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

(మొదటి పేజి తరువాయి)
కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హోంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హోంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హోంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

# దావోస్ చేసుకున్న సిఎం రేవంత్ బృందం

## పెట్టుబడులు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం

(మొదటి పేజి తరువాయి)
దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా తెలంగాణకు ఉన్న సానుకూలతలను చాటి చెప్పి పెట్టుబడులను తెచ్చే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా దావోస్ లో రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతుంది. ప్రపంచ అగ్రశ్రేణి పరిశ్రమలు, సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీకానున్నారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. కాగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.

# సాగునీటి కోసం రైతన్నలు రోడ్డెక్కడం కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనం: హరీష్ రావు

జనవరి 20(జర్నలిస్ట్ వార్త):సాగునీటి కోసం రైతన్నలు రోడ్డెక్కడం కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనం అని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యానించారు. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత జిల్లాలోనే సాగు నీటికి కటకట ఏర్పడిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రుల మాటలు కోటలు దాటితే.. ఆచరణ గడప దాటదంటూ ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది,రైతన్నకు క‘న్నీటి’ గోసను తెచ్చిందంటూ మండిపడ్డారు. పంట పొలాలకు నీళ్ల కోసం రోడ్లెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితిని కల్పించిందన్నారు. సాగు నీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సొంత జిల్లా సూర్యపేటలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఏమిటి..? అని ప్రశ్నించారు. యాసంగి సాగునీటి విడుదల షెడ్యూల్ పేరిట కోట్ల ప్రజాధనం వెచ్చించి ప్రకటనలు ఇచ్చారని మండిపడ్డారు.ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ -2లో భాగంగా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాల్లోని 3,36,630 ఎకరాలకు సాగు నీటిని విడుదల చేస్తామని ప్రకటనల్లో పేర్కొన్నారన్నారు. ప్రచారం చేసుకున్నారు గానీ రైతన్నల పంట పొలాలకు నీళ్లు మాత్రం విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.“మీ ప్రభుత్వ మాటలు నమ్మి నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏం కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి” అంటూ ప్రశ్నించారు. నాట్ల దశలోనే సాగు నీటికి గోస పడితే, మన్ముందు సాగు నీరు నీటి సరఫరా ఎలా చేస్తారని ప్రశ్నించారు. అద్భుతాలు చేస్తున్నట్లు భ్రమలు కల్పించడం మానేసి, ఇప్పటికైనా ఆచరణకు దిగాలని హితవు పలికారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు, ప్రతిపక్షాల మీద ఆరోపణలు చేయడం మానేసి పంట పొలాలకు నీళ్లు అందించాలని.. ఆందోళనలో ఉన్న రైతన్నకు దన్నుగా నిలవాలని హరీష్ రావు ట్వీట్ చేశారు.

## ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార కేసులో దోషి సంజయ్ రాయ్‌కి జీవితఖైదు

(మొదటి పేజి తరువాయి)
ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి బలవంతంగా సీబీఐకి బదిలీ చేశారని అన్నారు. ఒకవేళ పోలీసుల చేతుల్లోనే ఉంటే వారు దోషికి ఉరిశిక్ష పడేలా వందశాతం ప్రయత్నించే వారని సీఎం మమత పేర్కొన్నారు.
అటు, ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ విద్యార్థులు కూడా సీల్దా కోర్టు దోషికి జీవితఖైదు విధించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారు న్యాయస్థానం ఎదుట ఆందోళనకు దిగారు. సంజయ్ రాయ్ కి ఉరిశిక్ష విధించాలని విద్యార్థులు నిరసన తెలిపారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, సీల్దా కోర్టు తీర్పుపై హైకోర్టుకు వెళతామని ప్రకటించారు. కాగా, న్యాయస్థానం ఇది అత్యంత అరుదైన కేసు కేటగిరీలోకి రాదని, అందుకే సంజయ్ రాయ్‌కి మరణశిక్ష విధించలేమని పేర్కొంది. ఇదే అంశంపై కోల్‌కతా సీల్దా కోర్టు సీబీఐతో కూడా విభేదించింది.



# రాహుల్‌గాంధీకి ఊరట

## క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు

(మొదటి పేజి తరువాయి)
2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝా పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝాకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం

(మొదటి పేజి తరువాయి)
దేశ, విదేశీ అతిథులతో క్యాపిటల్ హిల్ రోటుండా కిటకిటలాడింది.ప్రమాణస్వీకారోత్సవానికి ముందు జో బైడెన్‌ను కలిసేందుకు ట్రంప్ శ్వేత సౌధానికి వెళ్లగా.. ఆయనకు బైడన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అనంతరం శ్వేతసౌధం నుంచి వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో జరిగే ప్రమాణస్వీకారోత్సవానికి జో బైడెన్, ట్రంప్ ఒకే వాహనంలో వెళ్లారు. భారత్ తరపున ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ తరఫున హాజరైన జైశంకర్.. ట్రంప్‌నకు మోదీ రాసిన లేఖను అందజేసారు. మెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకార వేడుకకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు ముకేశ్ అంబానీ దంపతులు సైతం హాజరయ్యారు. పలువురు అమెరికా మాజీ అధ్యక్షులు సతీసమేతంగా ఈ వేడుకకు విచ్చేశారు. బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, లారా బుష్ తదితరులు విచ్చేశారు. బరాక్ ఒబామా హాజరైనప్పటికీ మిచెల్లీ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందే ప్రకటించారు. అమెరికా సుప్రీంకోర్టుకు చెందిన తొమ్మిది మంది జడ్జిలు ఈ వేడుకకు హాజరయ్యారు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్ బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేతకాక నిరసనలు అడ్డుకోవడం సిగ్గుచేటు : జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్,జనవరి 20(జర్నలిస్ట్ వార్త)::రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పాలన చేతకాక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల నిరసనను అడ్డుకుంటున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పని చేయటం పార్టీల హక్కు అని తెలిపారు. తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏ కార్యక్రమం తీసుకున్నదని ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపించారు.కేటీఆర్ ఏ కార్యక్రమం చేపట్టినా రేవంత్ రెడ్డికి ఎందుకు వణుకు పుడుతుందని ప్రశ్నించారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కండ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతులు పంట చేలకు నిప్పు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మోసం చేసినందుకు బీఆర్ఎస్ పార్టీ రైతు దీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తుంది. రేపు నల్గొండలో సభ నిర్వహిస్తామంటే ఈ రోజు పోలీసులు అనుమతి నిరాకరించారు. చేసిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతుంటే అనుమతులు నిరాకరించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పోలీసుల తీరును తప్పు పడుతూ కోర్టుకు వెళ్లైనా ధర్నా చేపడుతామని స్పష్టం చేశారు. గతంలో కూడా కుంటి సాకులు చెప్పి అనుమతులు నిరాకరిస్తే కోర్టుకు వెళ్లి మరీ శాంతియుతంగా ధర్నా చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కేటీఆర్ ఎక్కడికి వెళ్లినా శాంతియుతంగానే ప్రజలు కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎంత అడ్డుకున్నా రేపటి దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



హైదరాబాద్,జనవరి 20(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

# వర్గీకరణపై మాట ఇచ్చి తప్పొద్దు..!

**- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ - లక్ష డప్పుల వేలగొంతుల భారీ ప్రదర్శనతో దద్దరిల్లిన హనుమకొండ**






హనుమకొండ/జనవరి 21(జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా వేయి స్తంభాల గుడి దగ్గర నుండి అంబేద్కర్ సెంటర్ వరకు వేల గొంతుల లక్ష డప్పుల భారీ ప్రదర్శనతో సోమవారం హనుమకొండ నగరం దద్దరిల్లింది. మాదిగ దండోరా ఆధ్వర్యంలో భారీ ప్రదర్శనగా అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం మందకృష్ణ మాదిగ అంబేద్కర్ విగ్రహానికి పూలదండలతో సత్కరించి, ఘనంగా నివాళులు అర్పించారు. మిట్టపల్లి సురేందర్ అధ్యక్షతన ప్రారంభించిన సమావేశానికి హాజరైన తాటికొండ రాజయ్య మాదిగ మాట్లాడుతూ లక్ష డబ్బులు వేల గొంతుల కార్యక్రమంలో పాల్గొని కృష్ణ మాదిగ తయారు చేసిన బాణం తనేనని చెప్పుకున్నారు. మాదిగ అస్తిత్వాన్ని కాపాడడానికి కృష్ణన్నతో మాదిగ రిజర్వేషన్ కోసం కలిసి ప్రయాణం చేశానని చెప్పారు. మాదిగ సోదరులు కృష్ణ మాదిగకు తోడుగా ఉండడం వలన మాదిగ రిజర్వేషన్ సాధించుకున్నామని అన్నారు. పృధ్విరాజ్ యాదవ్ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ న్యాయమైన డిమాండ్ మేధావులు అంటున్నారని, తాను సీక్రెట్ ఏజెంట్ ని కాదు వయోలెంట్ ఏజెంట్ అన్నారు. నమిండ్ల శీను మాదిగ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మాట ఇచ్చిందంటే ఏబిసిడి రిజర్వేషన్ ఎన్ని శక్తులు అడ్డుపడినా రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ ఏబిసిడి వర్గీకరణ చేసి తీరుతుందని అన్నారు. కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 7 తారీఖు రోజున వేల గొంతుల లక్ష డప్పులు సభను విజయవంతం చేయాలని కోరారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ భారతదేశంలో ఒక్క మాల కులం తప్ప అన్ని కులాలు ఏబిసిడి వర్గీకరణకు మద్దతు తెలిపాయ అని అన్నారు. ధర్మం న్యాయం సమాజం మొత్తం మాదిగల వైపు ఉన్నదని, ఒక మాల కులం మాత్రమే ఏబిసిడి వర్గీకరణకు వ్యతిరేక పోరాటం చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు సభలో జెడ్పిటిసి స్థాయి నుండి ముఖ్యమంత్రి వరకు వచ్చానంటే మాదిగ సోదరులఅండ దండలతోనే జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి నిండు అసెంబ్లీలో ఏబిసిడి వర్గీకరణ చేసిచేరుతామని గత నోటిఫికేషన్ లోనే ఏబిసిడి వర్గీకరణతో ఉద్యోగ నియామకాలు చేస్తామని ప్రకటించి మాట తప్పారని అన్నారు. కానీ మాట నిలబెట్టుకోకపోగా మాల కులస్తుల ఒత్తిడికి తలొగ్గి ఏబిసిడి వర్గీకరణ చేయలేకపోతున్నారని అన్నారు. భారతదేశంలో అన్ని కులాలు మతాలు ఏబిసిడి వర్గీకరణకు అనుకూలంగా ఉన్న ఈరోజు మనం రోడ్డెక్కి వర్గీకరణ కోసం పోరాడుతున్నామంటే ఒక్క మాల కులం మద్దతు ఇవ్వకపోవడం వల్లే అని భారతదేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏబిసిడి వర్గీకరణకు అనుకూలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఒక్క మాల కులం వివేక్ వెంకటస్వామి ఆరోజు అడ్డుతలగగా ఇప్పుడు వారి కుమారులు అడ్డుతగులుతున్నారని అన్నారు. అంతేకాకుండా ఒక్క వివేక్ వెంకటస్వామి కుటుంబంలోనే మూడు పదవులు ఉన్నాయని కర్ణాటకలో మల్లికార్జున్ ఖర్గే కుటుంబానికి మూడు పదవులు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీలో సోనియాగాంధీ కుటుంబానికి మూడు పదవులు ఉన్నాయా అని ,మిగతా ఏ కులాలకు మూడు పదవులు లేవని అన్నారు. మాజీ రాష్ట్రపతి కే ఆర్ నారాయణ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజశేఖర్ రెడ్డి రేవంత్ రెడ్డి ఇప్పుడున్న మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏబిసిడి వర్గీకరణకు అనుకూలంగానే ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, కవి గాయకులు మిట్టపల్లి సురేందర్, పృథ్వీరాజ్ యాదవ్, మంద కుమార్ మాదిగ, బొట్ల బిక్షపతిమాదిగ ,మంద కుమార్ మాదిగ, ఏపూరి సోమన్న, చెలిమల సుధాకర్ మాదిగ, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, నమిండ్ల శ్రీనివాస్ ,ఆరూ రీ రమేష్ కొండేటి శ్రీధర్ ,తాటికొండ రాజయ్య ,మెట్టు శీనన్న మాదిగ , గోనెప్రకాష్ రావు, బుర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు

**- ఒకరిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ సీఐ స్వరూప**





పర్వతగిరి/జనవరి 21(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ అధికారులు సోమవారం పర్వతగిరి మండల పరిధిలో గుడుంబా స్థావరాలు పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమినర్, వరంగల్ డిప్యూటీ కమినర్, వరంగల్ ఎక్సైజ్ సూపర్డెంట్ ఆదేశాల మేరకు గుడుంబా నిర్మూలన కొరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. పర్వతగిరి మండలంలోని తూర్పు తండ, ఏనుగల్లు, మూడేద్దుల తండ గ్రామ పరిసరాలలో వర్ధన్నపేట అధికారులు సిబ్బంది, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ వరంగల్, అధికారి సిబ్బందితో నాటు సారాయి కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. తూర్పుతండకు చెందిన అజ్మీర వాగ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడులలో 10 లీటర్ల నాటు సారాయి, 25 కేజీల నల్లబెల్లం కేజీల పటిక స్వాధీన పరచుకుని, 600 వందల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఈ దాడులలో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ వరంగల్, ఇన్స్పెక్టర్ రమేశ్ చెందర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సరిత, పర్వతగిరి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బి. ప్రవీణ్, కానిస్టేబుల్స్, శరత్ కుమార్, అనిల్ కుమార్, వంశీకృష్ణ, పరుశురాం, జగదీష్, సంతోష్, రాజమౌళి ఉన్నారు.

## యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



రాయపర్తి/జనవరి 20(జర్నలిస్ట్ వార్త): మండలంలోని కొండాపురం గ్రామంలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ నీ సోమవారం ఎన్నుకున్నారు. గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కన్నబోయిన రాజు,ఉపాధ్యక్షుడు కోల రాకేష్ ప్రధాన కార్యదర్శిగా పాక మహేందర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేంద్ర రావు, మండల యూత్ అధ్యక్షులు బొమ్మెరా కళ్యాణ్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఖదీర్,ప్రధాన కార్యదర్శి రదరపు రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంగిరేకుల మధుకర్,నాయకులు మాదారపు అశోక్,సుధాకర్, కనుకుంట్ల అశోక్,తరల రాజు,అనవత్తుల ముఖేష్,అనబత్తుల నరేష్,కనుకుంట్ల సతీష్ చంద్ర, కనుకుట్ల శ్రావణ్ చంద్ర,కనుకుట్ల మధుకర్,కొండ సంతోష్, పెద్దగోని సంతోష్,బొమ్మవాని రవి,నూనె సుమన్,ఆవిరిల్ల లింగన్న,అశోక్,తేరాల రాజు,కన్నబోయిన రవి, కోల వెంకటేష్, కోల అరవింద్,ఎనగందుల వినయ్,ఘర్షల నరేష్, రెడ్డబోయిన రాజు,పున్నం వెంకన్న,కొండ రమేష్,అలవాల శ్రీకాంత్,కేతన్ సోమయ్య,అవిరిండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం కమిషనరేట్లో పట్టుబడిన 216 కిలోల గంజాయి దహనం



తల్లాడ/జనవరి20(జర్నలిస్ట్ వార్త): వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ నేతృత్వంలో సోమవారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన, సీజ్ చేసిన 216 కిలోల ఎండు గంజాయిని అడిషనల్ డీసీపీ ఆడ్మీన్ నరేష్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవి పర్యవేక్షణలా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సల్టెన్సీ బైయో వెస్టెజ్ బర్నింగ్ ప్లాంట్ లో దహనం చేశారు. ఖమ్మం త్రీ టౌన్,ఖమ్మం ఖానాపురం హావేలి, వేంసూరు, వి.యం.బంజారా, వైరా,ఎర్రుపాలెం ,మధిర ,బోనకల్లు, కారేపల్లి, ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 18 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జరిపిన నేరస్థులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు అడిషనల్ డిసీపీ తెలిపారు. జిల్లా పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయి సరకును కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వీర్యం చేశామన్నారు. కార్యక్రమంలో సీసీఆర్బీ సిఐ స్వామి, తల్లాడ ఎస్సై కొండలరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వెయ్యి గొంతులు - లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలి

**-ఎమ్మార్పీఎస్ మండల నూతన అధ్యక్షుడుగా సంగెపు రామకృష్ణ**



కల్లూరు టౌన్/జనవరి 20(జర్నలిస్ట్ వార్త): ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తక్షణం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంద కృష్ణమాదిగ ఫిబ్రవరి 7 న హైదరాబాద్ లో తలపెట్టిన వెయ్యి గొంతులు - లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నూతన అధ్యక్షుడుగా సంగెపు రామకృష్ణ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ మండల అత్యవసర సమావేశం కల్లూరు శాంతి నగర్ లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల నూతన అడహక్ కమిటీ అధ్యక్షునిగా సంగెపు రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాదక్ష్యులు ఇస్నేపల్లి అశోక్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ. ఎస్సిల్లో ఉన్న 59 కులాలకు సమన్యాయం జరగడం కోసం 30 ఏళ్ళుగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటం చివరి అంకానికి చేరుకుందని, ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎవ్వరికీ వ్యతిరేకం కాదని, డా, బి. అర్ అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం కల్పించిన హక్కులు 59 కులాలకు జనాభా ప్రాతిపదికన సమానంగ అందాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణను సమాజంలో అన్ని వర్గాల ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు,కవులు, కళాకారులు,మేదావులు సమర్ధిస్తూ మద్దతు ఇస్తుంటే, కేవలం ఎస్సిలో ఉన్న ఒక సామాజిక వర్గం అడ్డు కోవడం, ఆ దిశగా మరో వ్యతిరేఖ ఉద్యమం చేపట్టడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి 7న తెలంగాణ రాష్ట్ర రాజదాని లో మాదిగల అస్తిత్వాన్ని చాటే విధంగా, ప్రతి పల్లె నుంచి ఇంటికొక మాదిగ డప్పు ను చేతబట్టి హైదరాబాద్ చేరుకోవాలని, మంద కృష్ణ మాదిగ నాయకత్వానికి బాసటగా నిలబడాలని విజ్ఞాప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యమ్ ఆర్ పీ యస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆదూరి కిరణ్, యమ్ ఆర్ పీ యస్ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు బొక్కా వేంకటేశ్వరరావు, నల్లగట్ల కోటేశ్వర రావు, చాట్ల రంజిత్ , కోరకొప్పు ప్రసాద్, గొల్లమందల రాఘవులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఖమ్మంపాటి పుల్లారావు ,కొండూరు కిరణ్ కుమార్ , కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రమేష్, యమ్ ఈ యఫ్ నాయకులు గుర్రాల సుదీర్ , ఖమ్మంపాటి నాగేశ్వరరావు, యంగల పెంటయ్య, యంగల వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు (అబ్బాయి), ఖమ్మంపాటి బాబురావు, బొల్లేపోగు జాన్సన్, ఖమ్మంపాటి శ్రీనివాసరావు, ఖమ్మంపాటి వీరస్వామి, గద్దల శ్రీరాములు, బోల్లేపోగు కృష్ణ, బుర్రి శ్రీనివాసరావు, కోలేటి శ్రీనివాసరావు, కంచపోగు కుటుంబరావు, రాయల సుందర్ రావు, బోల్లేపోగు పెద్ద రామకృష్ణ, కొత్తపల్లి ఏసు, వీరేంద్ర, ఖమ్మంపాటి అప్పలస్వామి, గద్దల వేంకటేశ్వర్లు, జొన్నలగడ్డ నవీన్, లక్ష్మణ్ మరియు శాంతి నగర్ కాలనీ పెద్దలు, యూత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలు ద్వారా నే లబ్ధిదారుల ఎంపిక



రాయపర్తి/జనవరి20 (జర్నలిస్ట్ వార్త): గ్రామ సభల ద్వారానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రేషన్ కార్డు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక చేపడుతామని జిల్లా కలెక్టర్ డా సత్య శారదా దేవి అన్నారు. సోమవారం మండలంలోని గన్నారం గ్రామంలో సంక్షేమ పథకాలు సర్వే ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ అర్హులైన వారికి 100% లబ్దిని చేకూర్చేలా ఎంపిక చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు.లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామ్ రెడ్డి,మండల స్పెషల్ ఆఫీసర్ ఏ. నాగమణి, డిఎం సివిల్ సప్లై అధికారి డి సంధ్యారాణి,తహసిల్దార్ ఎం శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. కిషన్,మండల పంచాయతీ అధికారి కె. ప్రకాష్,పి ఆర్ ఎ ఈ శ్రీప్రియ, పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించండి.

### -సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ.

వేంసూరు/జనవరి20(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన ప్రకారం మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించండి.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు.సోమవారంఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు పెండింగ్ బిల్లులు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని నిత్యవసర సరుకులు దారులు పెరిగి కొనలేని పరిస్థితి ఏర్పడిందని కోడి గుడ్డు ధర మార్కెట్ రేటు కంటే మూడు రూపాయలు అదనంగా ఉందని అరకొర వేతనాలతో అవి కూడా సకాలంలో అందక బిల్లులు సకాలంలో అందక అనేక రకాల ఇబ్బందులు పడి వంట చేస్తున్న కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేయాలని



విజ్ఞప్తి చేశారు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన ప్రకారం 10000 జీతం పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పిఎఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని మధ్యాహ్న భోజన కార్మికులకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లు సరుకులు బియ్యంతో పాటు గ్యాస్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జావా కాశి పోస్తున్న వాటికి ఎలాంటి బిల్లు రావట్లేదని ప్రత్యేక బిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు ఎస్సీ ఎస్టీ బీసీ పేరుతో బిల్లులు చెల్లించడం వల్ల వారి పరిస్థితి రంగా మారిందని బిల్లులో సమగ్రమైన సమాచారం లేకుండా అరాకొరగా ఏసి చేతులు తెలుపుకుంటున్నారని దీనిపై సమగ్ర లెక్కలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మహిళా సమైక్య డివిజన్ కన్వీనర్ ఎస్.కె రంజాన్, బి కర్రీ రాజమ్మ,పిల్లి బుచ్చాలు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి లోక వెంకటేశ్వరరావు,బింగి నాగవెంకటేశ్వరరావు,సామ్రాజ్యం,లాల్ మహమ్మద్, సీతా మహాలక్ష్మి,రాధమ్మ, సూరమ్మ,నాగమణి, కనకమ్మ, మల్లమ్మ,పుల్లమ్మ,కోటయ్య,ఇందిరా, వరలక్ష్మి,మంగ,తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి గొంతులు - లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### -ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పును రాష్ట ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి.

**కల్లూరు టౌన్/జనవరి 20(జర్నలిస్ట్ వార్త):** వెయ్యి గొంతులు - లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయ్యాలని ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి.ఎక్కిరాల సుధాకర్, మామిడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కల్లూరు మండలం ముగ్గు వెంకటా పురం గ్రామ పంచాయితీ చతన్య నగర్ కి చెందిన యం ఆర్ పి యస్ తరుపున పిబ్రవరి 7న జరుగు సభకు సంఘీభావం తెలుపుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తక్షణం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ. మంద కృష్ణమాదిగ ఫిబ్రవరి 7 న హైదరాబాద్ లో తలపెట్టిన వెయ్యి గొంతులు - లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అత్యవసర సమావేశంముగ్గు వెంకటా పురం చైతన్య నగర్ లో జరిగింది.ఎస్సిల్లో ఉన్న 59 కులాలకు సమన్యాయం జరగడం కోసం 30 ఏళ్ళుగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటం చివరి అంకానికి చేరుకుందని, ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎవ్వరికీ వ్యతిరేకం కాదని, డా, బి. అర్ అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం కల్పించిన హక్కులు 59 కులాలకు జనాభా ప్రాతిపదికన సమానంగ



అందాలని కోరినారు.ఎస్సీ వర్గీకరణను సమాజంలో అన్ని వర్గాల ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు, కవులు, కళాకారులు, మేదావులు సమర్ధిస్తూ మద్దతు ఇస్తుంటే, కేవలం ఎస్సిలో ఉన్న ఒక సామాజిక వర్గం అడ్డు కోవడం, ఆ దిశగా మరో వ్యతిరేఖ ఉద్యమం చేపట్టడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి 7న తెలంగాణ రాష్ట్ర రాజదాని లో మాదిగల అస్తిత్వాన్ని చాటే విధంగా, ప్రతి పల్లె నుంచి ఇంటికొక మాదిగ డప్పు ను చేతబట్టి హైదరాబాద్ చేరుకోవాలని, మంద కృష్ణ మాదిగ నాయకత్వానికి బాసటగా నిలబడాలని విజ్ఞాప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఎక్కిరాల సుధాకర్, మామిడి వెంకటేశ్వర్లు, రాయల వెంకటేశ్వర్ రావు (పండు ), కూవ్వారపుచిన్న శివ, కూవ్వారపు శ్రీను, మల్లాది కృష్ణ, నాగేశ్వరావు,ఎక్కిరాల కృష్ణ,కూవ్వారపు కిరణ్ కుమార్, కళ్లేపల్లి భాస్కర్ రావు, వాసం వెంకటేశ్వర్లు (బుజ్జోడు),కోట పుడియ్య,కళ్లేపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

జనవరి 20(జర్నలిస్ట్ వార్త): దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ది చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు.
కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి



తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యయసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూములు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూముల కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. దావోస్ పర్యటనలతో డబ్బు వృధా చేసుకునే బదులు దేశీయ ఆలోచనలతో ముందుకు నడవడం అవసరం.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



రాయపర్తి/జనవరి 20(జర్నలిస్ట్ వార్త):మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోలే కుమారస్వామి తల్లి పోలే ఎల్లమ్మ సోమవారం అనారోగ్యంతో మరణించగా వారి పార్థివా దేహానికి నివాళ్లు బిఆర్ఎస్ నాయకులు మాజీ రైతుబంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్ రావు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయ%శీ% అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ సహాయ కార్యదర్శి ఘౌడిశెట్టి రామారావు,మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్,మండల పార్టీ నాయకులు పోగులకొండ వేణు, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు గజవెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్,నాయకులు చిన్నల ఉప్పలయ్య, చందు మల్లేష్, గుడ్ల గురునాథ%శీ%, కసరబోయిన రాజు, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటా

రాయపర్తి/జనవరి20 (జర్నలిస్ట్ వార్త):మండలంలోని ఏ కె తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరావత్ హమ్యా-అమ్మి ల చిన్న కుమార్ యువ రైతు ధరావత్ గోపి ఆదివారం కరెంట్ షాక్ తో మృతి చెందగా విషయం తెలుసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే



మామిడాల యశస్విని రెడ్డి సోమవారం సంఘటన స్థలానికి చేరుకుని గోపి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు హమ్య నాయక్,మండల అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి,వర్దణపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణా రేడ్డి, మండల ఉపాధ్యక్షుడు భూక్య సమ్మయ్య, మండల నాయకులు మందాటి సుదర్శన్ రెడ్డి,కూల్లూరి దామెందర్ రెడ్డి, చెరుకూరి నాగేశ్వర్ రావు, బధ్రు నాయక్,మాజీ సర్పంచ్ సోము నాయక్,రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై సన్నాహక సమావేశం

కల్లూరు/జనవరి20(జర్నలిస్ట్ వార్త): ఖమ్మం జిల్లా కల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 4 స్కీములకు సంబంధించిన గ్రామ సభలకు సన్నాహక సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో దయగల చంద్రశేఖర్ అన్నారు. మండలంలో 21, 22, 23 తేదీలలో రేషన్ కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ




ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాలు పై అన్ని గ్రామ పంచాయతీ గ్రామసభలలో అరులైన జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అర్హుల జాబితాలో పేరు లేని వారు ఏ మాత్రం అధైర్య పడకుండా గ్రామసభలో మరల దరఖాస్తు చేసుకోవచ్చని ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డిఓ ఎల్ రాజేంద్ర గౌడ్, తాసిల్దార్ పులి సాంబశివుడు, ఎం పి ఓ సురేష్ కుమార్, వ్యవసాయ అధికారిని రూప, ఏపీవో హేమమాలిని, ఐసిడిఎస్ ఎసిడిపిఓ, గ్రామ ప్రత్యేక అధికారులు,కార్యదర్శులు,ఈ జీ స్ సిబ్బంది పాల్గొన్నారు.




## భారీ అంచనాలు పెంచుతున్న తండేల్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇప్పటికే లవ్ స్టోరీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ స్టార్ యాక్టర్లు ప్రస్తుతం తండేల్‌లో నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం చందూ మొండేటి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. అయితే తాజాగా మరో క్రేజీ నిర్ణయాన్ని తీసుకున్నారన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. తండేల్ మలయాళం వెర్షన్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. సాయిపల్లవికి మలయాళంలో సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఒకవేళ ఇదే నిజమైతే తండేల్ సినిమాకు మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# ఆకట్టుకుంటోన్న 'భైరవం' టీజర్

టాలీవుడ్ యంగ్ హీరోలు మంచు మనోజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్ కీలక పాత్రల్లో విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్నచిత్రం 'భైరవం'. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్‌లో మనోజ్, రోహిత్, శ్రీనివాస్ ముగ్గురి హైవోల్టేజీ యాక్షన్ సీన్స్‌తో అదరగొట్టారు.

వారాహి గుడి, ఒక ఊరు నేపథ్యంలో యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందని టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది. ఇక ఈ ముగ్గురు హీరోల పక్కన దివ్య పిళ్ళై, అదితి శంకర్, ఆనంది కథానాయికలుగా నటించారు. అలాగే జయసుధ, ప్రియమణి కీలక పాత్రలో కనిపించనున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు.




## శివుడి పాత్రలో అక్షయ్‌కుమార్ ఆకట్టుకుంటున్న కన్నప్ప లుక్

ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ పరమేశ్వరుడి పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది. ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు అంటూ అక్షయ్ శివుడి రూపంలో ఉన్న అక్షయ్ ఫస్ట్ లుక్‌ని పంచుకుంది.




# టాలీవుడ్‌లో విషాదం.. విజయ రంగరాజు మృతి



**తెలుగు సినీ పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది.** ప్రముఖ నటుడు విజయ రంగరాజు మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అకస్మాత్తుగా ఆయనకు గుండెపోటు రావడంతో రంగరాజు మరణించినట్లు సమాచారం. ఇక రంగరాజు మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆయనకు సంతాపం ప్రకటిస్తున్నారు. విజయ రంగరాజు అసలు పేరు రాజ్ కుమార్. ఆయన చెన్నైలో రంగస్థల కళాకారునిగా అనేక నాటకాలలో నటించారు. ఆ తర్వాత సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. బాపు దర్శకత్వంలో వచ్చిన 'సీతా కళ్యాణం' రంగరాజుకు నటుడిగా మొదటి సినిమా. అయితే అతడికి గుర్తింపు లభించింది మాత్రం బాలకృష్ణ హీరోగా వచ్చిన భైరవ ద్వీపం సినిమా ద్వారా. ఈ సినిమాలో అతడి నటనకు మంచి మర్కులు పడడమే కాకుండా సినిమాల్లో ఫుల్ బిజీగా మారిపోయాడు. నటుడిగా, ఫైట్ మాస్టర్‌గా, ఫైటర్‌గా, విలన్‌గా అన్ని భాషల్లో కలుపుకుని దాదాపు ఐదు వేలకు పైగా సినిమాల్లో ఆయన పనిచేశారు. గోపీచంద్ నటించిన 'యజ్ఞం' సినిమాలో ఆయన విలన్‌గా నటించడం అతడి కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అని పలు ఇంటర్వ్యూలలో ఆయన చెప్పుకోచ్చాడు.

# మీనాక్షికి ఫస్ట్ క్రష్ అతడే



సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో హిట్టు అందుకొని వరుస హిట్లతో ఇండస్ట్రీలో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి. అయితే తను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచినప్పటి నుండి ఎవరో ఒక హీరోతో డేటింగ్ లో ఉందని, ఇంకో హీరోతో పెళ్లి అని ఏదో ఒక పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతకీ మీనాక్షి లైఫ్ లో లవ్ ఉందా? ఆమెకు ఎవరంటే ఇష్టం? వీటిపై ఆమె ఏమన్నారు అంటే.. తనపై వస్తున్న రూమర్స్ ని ఖండిస్తూనే మీనాక్షి తన లవ్ లైఫ్ గురించి చెప్పేసింది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. " ప్రస్తుతం అయితే నా ఫోకస్ అంత సినిమాలపైనే ఉంది. స్కూల్ లేదా కాలేజీలో స్టూడెంట్స్ కు కచ్చితంగా టీచర్లపై క్రష్ ఉంటుంది. నాక్కూడా అలాంటిదే ఉంది. నేను 9వ తరగతి చదువుతున్నప్పుడు నా క్లాస్ లో ఓ టీచర్ అంటే చాలా ఇష్టం. టోటల్ క్లాస్ మొత్తం అతడ్ని ఇష్టపడేది. నాకైతే ఇంకా ఎక్కువ ఇష్టం. అదే నా ఫస్ట్ క్రష్ అండ్ లవ్." అంటూ తన ఫస్ట్ క్రష్ ని రివీల్ చేసింది. మాటలు కొనసాగిస్తూ.. " నాకు ఆ తర్వాత మళ్లీ ప్రేమలో పడేంత టైమ్ దొరకలేదు. మరీ ముఖ్యంగా మెడిసిన్ చదువు వల్ల ప్రేమకు పూర్తిగా దూరమయ్యాను. కాలేజీ లైఫ్ లో ఎలాంటి లవ్ లేదు. చదువుతోనే సరిపోయింది. పైగా మెడికల్ కాలేజీ కదా ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. ఎప్పుడూ చదువే. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత కూడా నేను ఎవరి ప్రేమలో పడలేదు. కెరీర్ పై మాత్రమే ఫోకస్ పెడుతూ వస్తున్నాను. ఇప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నకాబట్టి ప్రేమ, పెళ్ళికి టైమ్ ఉంది. ప్రస్తుతానికి సినిమాలే నా లోకం" అంటూ ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది.



# బిగ్‌బాస్‌షోకుగుడ్‌బై చెప్పిన కన్నడ హీరో సుదీప్.

హాలీవుడ్ షో బిగ్ బ్రదర్‌కి మాతృకగా వచ్చిన బుల్లితెర రియాలిటీ షో బిగ్ బాస్‌కి ఇండియా అంతటా ఫ్యాన్స్ ఉన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీలోనే కాకుండా తమిళం, కన్నడలోను ఈ షో టాప్ రియాలిటీ షోలలో ఒకటిగా నిలిచింది. అయితే కన్నడ బిగ్ బాస్ షోకి సంబంధించి హోస్ట్‌గా చేస్తున్న స్టార్ హీరో కిచ్చా సుదీప్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఈ షోకి తాను ఇకపై హోస్ట్‌గా చేయనని వెల్లడించాడు. ఈ సందర్భంగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. కన్నడలో బిగ్‌బాస్ షో స్టార్ట్ అయినప్పటి నుంచి హోస్ట్‌గా కిచ్చా సుదీప్ ఉన్నాడు. 2013లో ఈ షో స్టార్ట్ అవ్వగా.. ఇప్పటివరకు 11 సీజన్‌లు విజయవంతంగా కంప్లీట్ చేసుకుంది. ఇందులో 11 సీజన్‌లకు సుదీప్ హోస్ట్‌గా వ్యవహరించి ప్రేక్షకులను అలరించాడు. అయితే ఈ స్టార్ నటుడు తాజాగా కన్నడ బిగ్ బాస్‌కి దూరమవుతున్నట్లు ప్రకటించాడు. "గత 11 సీజన్ల నుంచి నేను ఇష్టంతో పాటు ఎంజాయ్ చేసిన కార్యక్రమం బిగ్‌బాస్. ఈ షోకి హోస్ట్‌గా చేసిన నాపై మీరు చూపించిన ప్రేమకి ధన్యవాదాలు. త్వరలో జరుగనున్న ఫినాలేతో బిగ్ బాస్‌తో నా ప్రయాణం ముగుస్తుంది. వ్యాఖ్యతగా నా శక్తి మేరకు మీ అందరినీ ఎంటర్‌టైన్ చేశానని ఆశిస్తున్నాను. ఇది మరపురాని ప్రయాణం, నాకు సాధ్యమైనంతవరకూ ఉన్నతంగా దీనిని కొనసాగించా. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన కలర్స్ కన్నడ టీవీకి వారికి ధన్యవాదాలు. ప్రేమతో మీ కే" అంటూ రాసుకోచ్చాడు సుదీప్.